
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జనగామ
సోమవారం 22 జనవరి 2024



తోడేస్తున్నారు!

రోజురోజుకూ తరిగిపోతున్న ఏనెలు

- గుట్టు చప్పుడు కాకుండా మట్టి తరలింపు
- కోట్ల రూపాయలు గడిస్తున్న వ్యాపారులు
- అనుమతి పేరుతో అక్రమ దందా
- వన్యప్రాణులకు, మూగజీవాలకు ముప్పు
- గ్రామ పంచాయతీల ఆదాయానికి గండి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 21: జిల్లాలో సహజవనరులు కనుమరుగవుతున్నాయి. కొందరు అక్రమార్కులు రాత్రింబవళ్లు తవ్వకాలు జరుపుతూ ఏనెలను కరగదీస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా మట్టి తరలిస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, చిలుపూర్, జఫర్‌గడ్ మండలాల పరిధిలో వందలాది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఏనెల నుంచి మట్టిని తవ్వి వెంచర్లు, గృహ నిర్మాణాలు, రోడ్ల నిర్మాణాలకు అమ్ముకుంటూ అక్రమ సంపాదనకు తెరలేపారు. ఈ విషయమై రైతులు, గొర్రెల మేకల కాపర్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

గ్రామాల వారీగా తవ్వకాలు

స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని తాటికొండ గ్రామంతో పాటు, అక్కపల్లిగూడెం, ఇప్పగూడెం, పాంనూర్, విశ్వనాథపురం, తానేదార్‌పల్లి, చిలుపూరు మండలంలోని చిన్నపెండ్యాల, రాజవరం, నష్కల్, జఫర్‌ఘడ్ మండలంలోని తీగారం, సురారం గ్రామాలలో ఉన్నటువంటి ప్రకృతి సిద్ధమైన ఏనెలను మట్టితవ్వకాల పేరుతో నేల మట్టం చేస్తున్నారు. వేలాది క్యూబిక్ మీటర్ల మట్టిని దోచుకెళుతున్నారు. అక్కపల్లిగూడెంలో ఉన్న ఏనెను సుమారు 3 ఎకరాల విస్తీర్ణంతో తొలగించి చదును చేశారు. వేలాది క్యూబిక్ మీటర్ల మట్టిని అమ్ముకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ఇప్పగూడెం గ్రామ శివారులో ఉన్న ఏనెను సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంతో తొలగించి చదును చేశారు. విశ్వనాథపురం, తానేధార్‌పల్లి ఏనెల నుంచి మట్టిని గత కొన్ని రోజులుగా తరలిస్తున్నారు.

వన్యప్రాణులకు ఇబ్బంది

ఏనెలపై ఆధారపడి అనేక వణ్యప్రాణులు జీవిస్తాయి. వాటిపై అనేక వృక్షజాతులు, వివిధ రకాల ఔషధ గుణాలు కల్గిన మొక్కలు ఉంటాయి. మట్టి తవ్వకాల వల్ల హైనా, ఎలుగుబంట్లు, నెమళ్లు, నక్కలు, తోడేళ్ల జనజీవనం లోకి వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికే గ్రామాలలో వ్యవసాయ బావుల వద్ద లేగదూడలను హైనాలు చంపి తినేస్తున్నాయి. ఈ దందాను ఇప్పటికైనా ఆపకపోతే వన్య ప్రాణులు అంతరించిపోయే ప్రమాదం పొంచిఉంది.

మూగజీవాలకు ముప్పు

ఏనెలు తరిగిపోతే భవిష్యత్‌లో మూగజీవాలకు పశుగ్రాసం కరువవుతుంది. పశువులతో పాటు గొర్రెలు, మేకలకు ముప్పు ఏర్పడుతుంది. దీంతో రైతులు, పెంపకందారుల ఉపాధిపై ప్రభావం పడుతుంది. ఇప్పటికైనా అక్రమతవ్వకాలను నిలుపుదల చేయాలని బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ఇప్పగూడెం శివారులో యంత్రాలతో మట్టిని తవ్వుతున్న దృశ్యం

తవ్వకాలను ఆపేయాలి..



మునిగెల రమేష్, సీపీఎం నాయకుడు, ఇప్పగూడెం

ప్రకృతి సిద్ధంగా ఉన్నటువంటి ఏనెల తొలగింపు సరి కాదు. సంబంధిత అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై పట్టింపు లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఏళ్ల తరబడి జరుగుతున్న తవ్వకాలు అధికారులకు కనిపించక పోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తవ్వకాలను నిలుపుదల చేయాలి.

ప్రభుత్వ జీవోలను బేఖాతరు చేస్తున్నారు..



సాదం రమేశ్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి

జీవో నెంబరు 559 ప్రకారం సాగుచేయడానికి వీలుగా లేని బంజరు భూముల్లో ఏనెల వెంట కాపర్లు జీవాలను మేపుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. జీవోను తుంగలో తొక్కి కొందరు అక్రమార్కులు ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఏనెలను చెరపడుతూ మట్టిని అమ్ముకొని కొట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు మాముళ్ల మత్తు వీడి ఏనెలను కాపాడాలి.

కాపర్లకు ఇబ్బందులు...



వంగపండ్ల మహేందర్, గొర్రెల కాపరి, ఇప్పగూడెం

ఏనెల తొలగింపుతో రానున్న రోజుల్లో కాపర్లకు ఇబ్బందులు వస్తాయి. భూపట్టాలు, అనుమతులు ఉన్నాయనే సాకుతో కొందరు ఇష్టారాజ్యంగా ఏనెల నుంచి వచ్చే మట్టిని అమ్ముకొని లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. నిబంధనల మేరకు గ్రామ పంచాయతీలకు రవావాల్సిన ఆదాయానికి కూడా గండికొడుతున్నారు. అధికారులు ఈ విషయంలో చర్య తీసుకోవాలి.

నెల్లుట్ల సర్పంచ్ దంపతులకు బంపర్ ఆఫర్

- రాష్ట్రపతి ఎట్‌హోంకు నామినేషన్ పంపాలని ఉత్తర్వులు
- రిపబ్లిక్‌డే సందర్భంగా రాష్ట్రపతితో కలిసి తేనీటి విందు



స్వరూపారాణి, భూపాల్‌రెడ్డి

లింగాలఘణపురం, జనవరి 21: లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామ సర్పంచ్ దంపతులు చిట్ల స్వరూపారాణి భూపాల్‌రెడ్డికి అద్భుతమైన అవకాశం వచ్చింది. నెల్లుట్ల గ్రామపంచాయతీ కీర్తి పతాకాన్ని ఢిల్లీ గడ్డపై రెపరెపలాడించి 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను నీటి సమృద్ధి విభాగంలో జాతీయ పురస్కారాన్ని అందుకున్న తొమ్మిది నెలల్లోనే తాజాగా రాష్ట్రపతి ఎట్‌హోంకు హాజరయ్యే మరో అవకాశం దక్కింది. ఈనెల 26న గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించే ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ఎట్‌హోం వేడుకలకు రావాలంటూ ఆహ్వానం అందింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని కేంద్ర పంచాయితీరాజ్ విభాగం నుంచి తెలంగాణ పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఆదేశాలు అందాయి. దీంతో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా జిల్లా పంచాయితీ అధికారిని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. నెల్లుట్ల సర్పంచ్ దంపతులు స్వరూపారాణి భూపాల్‌రెడ్డికి సంబంధించిన పూర్తి డేటాతో కేంద్ర పంచాయతీ రాజ్ విభాగానికి వెంటనే నామినేషన్ సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో సర్పంచ్ దంపతుల్లో అవధులు లేని ఆనందం నెలకొంది. గతేడాది ఏప్రిల్ 17న వారు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా ఉత్తమసేవలకు సంబంధించి జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. అంతేగాకుండా గ్రామానికి కేంద్రం అందించిన రూ. కోటి నగదుతో ఊరంతా సీసీ రోడ్లు వేశారు. తాజాగా ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ఎట్‌హోంకు జాతీయ స్థాయి ప్రముఖుల వరుసల్లో నెల్లుట్ల సర్పంచ్ దంపతులు కూడా ఆసీనులు కానుండటం పట్ల జిల్లా ప్రజలు గర్వంగా భావిస్తున్నారు. జాతీయ స్థాయిలో కేవలం 8 మంది సర్పంచ్‌లకు మాత్రమే ఈ అవకాశం దక్కగా అందులో తెలంగాణ నుంచి నెల్లుట్ల సర్పంచ్‌కు స్థానం లభించడం విశేషం.

పేదరిక నిర్మూలనే కేంద్రం లక్ష్యం

- కేంద్ర మంత్రి ఆర్‌కే.సింగ్



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న కేంద్ర మంత్రి ఆర్‌కే సింగ్

జనగామ టౌన్, జనవరి 21: దేశంలో పేదరికాన్ని నిర్మూలించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్ అన్నారు. జనగామ మండలంలోని పెంబర్తి గ్రామంలో ఆదివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. ఇప్పటికే దేశంలో నిరుపేదలకు 3 కోట్ల ఇండ్లను నిర్మించామని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ కింద చికిత్స పొందే వారికి రూ.5 లక్షలు వెచ్చిస్తున్నామన్నారు. దేశంలో 2.36 కోట్ల విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇచ్చామని తెలిపారు. ఎలాంటి పూచీకత్తు లేకుండా స్వయం ఉపాధిని ప్రోత్సాహించేందుకు ముద్ర రుణాలు ఇస్తున్నామన్నారు. చిరు వ్యాపారులకు రుణాలు అందించడంలో జనగామ రెండో స్థానంలో ఉండడం సంతోషకరమన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గతంలో పదో స్థానంలో ఉన్న భారత్ ఇప్పుడు ఐదో స్థానానికి చేరుకుందన్నారు. రానున్న కాలంలో మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం

మిగతా 8వ పేజీలో

క్రీడలతో స్నేహబాంధవ్యాలు

- సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి
- వంగాలపల్లిలో ముగిసిన పోలీసుల క్రికెట్ పోటీలు



హైదరాబాద్ జట్టుకు షీల్డును అందజేస్తున్న డీసీపీ ఎంఏ బారి

చిలుపూర్, జనవరి 21 : క్రీడలతో స్నేహ బాంధవ్యాలు పెంపొందుతాయని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి అన్నారు. ఆదివారం చిలుపూర్ మండలం వంగాలపల్లి సమీపంలో 2009 బ్యాచ్‌కి చెందిన సీఐల బృందం ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు షీల్డును అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 2009 సంవత్సరంలో ఎస్సైలుగా ఎంపికైన ప్రస్తుత సీఐల టీం వరంగల్ రేంజ్ - టీం హైదరాబాద్ హంటర్స్‌గా ఏర్పడి క్రికెట్ క్రీడా పోటీల్లో పాల్గొనడం శుభపరిణామమన్నారు. ఆటలు విధి నిర్వహణలో ఆటవిడుపుగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ రూరల్, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి సీఐలు ఎడవెళ్లి శ్రీనివాసరెడ్డి, సట్ల రాజు, డి.విశ్వేశ్వర్, మంచినీళ్ళ శ్రీనివాస్, ఫణీధర్, నాగబాబు, రవిరాజు, మహేశ్, రఘుతో పాటు, ఎస్సైలు బొల్లం వినయ్‌కుమార్, రఘుపతి, ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబ్రీమసీదు కూల్చిన ఘటనలో బండ్లగూడెం వాసులు

అప్పట్లో అయోధ్యకు బయలుదేరిన ఆరుగురు కరసేవకులు



నర్సిరెడ్డి



ప్రభాకర్‌రెడ్డి



రాంనర్సింహారెడ్డి



ఎల్లారెడ్డి



మహేందర్‌రెడ్డి



లక్ష్మారెడ్డి

లింగాలఘణపురం, జనవరి21: అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ వేళ దేశం నలుమూలల హిందూ నినాదం మార్మోగుతున్న నేపథ్యంలో బండ్లగూడెం గ్రామానికి చెందిన ఆరుగురు కరసేవకులు అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు. అయోధ్యలో రామజన్మభూమి ప్రాంతంలో నిర్మాణమైన బాబ్రీమసీదును కూల్చివేసేందుకు 1992లో లింగాలఘణపురం మండలం బండ్లగూడెం గ్రామానికి చెందిన కరసేవకులు అల్వాల నర్సిరెడ్డి, చెట్టుపల్లి ప్రభాకర్ రెడ్డి, ఆముదాల రాంనర్సింహారెడ్డి, వేముళ్ల ఎల్లారెడ్డి, చల్లా మహెందర్‌రెడ్డి, ఆముదాల లక్ష్మారెడ్డి అయోధ్యకు బయలు దేరినట్లు పేర్కొంటున్నారు. రెండు రోజుల పాటు తిండీ తిప్పలు లేకుండా అక్కడి వాళ్ల ఎదురుదాడిలో ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడామన్నారు. రామజన్మభూమిలో రామందిరం నిర్మాణానికి పునాదిరాయి వేసేందుకు అడ్డుగా ఉన్న మసీద్‌ను తొలగించేందుకు వానర సైన్యమై కదిలినట్లు తెలిపారు. ప్రస్తుతం మోదీ నేతృత్వంలో రామమందిరం నిర్మాణం చేసి ప్రారంభించడం ద్వారా తమ జన్మ సార్థకమైందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాంకేతిక, కళల సమ్మిళితంగా..

విజ్ఞానం, వినోదాన్ని పంచిన టెక్నోజియాన్

- ముగిసిన మూడురోజుల వేడుక
- స్ఫూర్తి నింపిన అతిథుల ప్రసంగాలు
- విజేతలకు బహుమతుల ప్రదానం

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రతిష్ఠాత్మకమైన వరంగల్ నిట్ కళాశాలలో అంగరంగ వైభవంగా నిర్వహించిన టెక్నోజియాన్-2024 ఆదివారం ముగిసింది. టెక్నోజియాన్‌లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల నిటియన్లు గుండెల నింపుకున్న అనుభూతులు, సరికొత్త ఆవిష్కరణ వల్ల కలిగిన అవగాహనలు, ఆలోచనలతో తిరుగు ముఖంపట్టారు. టెక్నోజియాన్‌లో వివిధరాష్ట్రాల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ అంశాలకు సంబంధించి 40కిపైగా ఈవెంట్లను నిర్వహించారు. వందకుపైగా సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. నిట్ విద్యార్థులతోపాటు నగరంలోని పలు పాఠశాలలకు చెందిన రెండు వందల మందికిపైగా విద్యార్థులు సైతం ఆయా సైన్స్‌ఫెయిర్లలో ప్రదర్శించి బహుమతులను గెలుచుకున్న ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈవెంట్లు, ఎగ్జిబిట్లు, స్పాట్ ఈవెంట్లు, వర్క్‌షాపులు, అతిథి ప్రసంగాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శాస్త్ర, సాంకేతికరంగాల్లో ఇటీవలకాలంలో చోటు చేసుకున్న సరికొత్త ఆవిష్కరణలను ఆకళింపు చేసుకునేందుకు, తమకు కలిగిన ఆలోచనలను తోటి విద్యార్థులతో పంచుకునేందుకు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల స్ఫూర్తిదాయక ప్రసంగాలను వినేందుకు టెక్నోజియాన్ వేదికగా నిలిచింది. ఈవెంట్ల లో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించారు.



ఏజాజ్ ఈవెంట్

అకట్టుకున్న ప్రసంగాలు, వర్క్‌షాపులు

టెక్నోజియాన్ రెండోరోజు శనివారం రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం చేసిన ప్రసంగం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపింది. టి-వర్క్ ప్రోటోటైపింగ్, త్రీడీ ప్రింటింగ్‌పై వర్క్‌షాపులు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నా యి. ఇందులో పాల్గొన్నవారు తయారీరంగానికి సంబం ధించి ఒక ప్రపంచాన్ని చూశారు. ప్రఖ్యాత వక్త డాక్టర్ నరసమ్మ మిట్టపల్లి వైజ్ఞానిక ప్రసంగం ప్రేక్షకులను కట్టిపడవేసింది. ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ ఈవెంట్, ఎఫ్‌పీవి రేసింగ్, ఎస్కేప్ రూమ్ ఈవెంట్లు ఆకట్టుకున్నాయి. ఇన్నోవేటివ్ స్పియర్ ఎక్స్‌పోకు హాజరైనవారు సృజనాత్మకతలో మునిగిపోయారు. విభిన్నరంగాల్లో కొత్త ఆవిష్కరణలు ఆలోచనల హద్దులను చెరిపేసింది. పాఠశాల విద్యార్థులు రూపొందించిన పలు రోబోలతో నిర్వహించిన రోబోటిక్స్ ఎగ్జిబిషన్ యువ మనస్సులను ఆకట్టుకున్నాయి.

సాంకేతిక, కళల సమ్మేళనం

మూడోరోజు టెక్నోజియాన్‌లో ప్రముఖ ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ టీఎన్ సురేష్‌కుమార్ అతిథి ప్రసంగం హైలైట్‌గా నిలిచింది. మరో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బిజిలీ బాలక్రిష్ణన్ సెషన్ విద్యార్థులను కట్టిపడేసింది. స్పాట్‌లైట్ ఈవెంట్లలో జహాజ్ అందరిని విశేషంగా ఆకట్టుకున్నది. వీఆర్ క్రికెట్ ఈవెంట్ సంప్రదాయ ఆటకు వర్చువల్ ట్విస్టునిచ్చింది. కోడ్‌మేజ్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు కోడింగ్‌లో నైపుణ్యాన్ని పెంచుకునేందుకు వీలు కల్పించింది. సాంకేతికత, వినోదం కలగలిసిన ఈ సమ్మేళనం మొత్తం మీద విద్యార్థులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ట్రెండింగ్ ఫిట్ ఈవెంట్ మార్కెట్ ఔత్సాహికులతో సందడి చేసింది. మెకానికల్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ నమూనా ప్రదర్శన రంగంలో అత్యాధునిక పరిణామాలను దర్శింప చేసింది. మేధోపరమైన విజ్ఞానాన్ని పెంపొందించడంలో టెక్నోజియాన్ లక్ష్యాన్ని హైలైట్ చేస్తూ, అలాగే పరిశోధనాపత్రాల ప్రదర్శనలపై దృష్టి సారిస్తూ చివరి రోజు కార్యక్రమం ముగిసింది. సాంకేతికత, కళల సంగమంగా త్రీడీ ప్రింటింగ్ పిక్సెల్స్ టు పోట్రేయిట్ ఈ టెక్నోజియాన్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశంగా నిలిచింది. స్పర్ధక్ వాహన ప్రదర్శన మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టింది. ఆల్ టేర్రేయిన్ వాహనం వరంగల్ నిట్ మెకానికల్ విద్యార్థుల నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్ కుమార్

'ముందస్తు' జాతర

- భక్తులతో కిటకిటలాడిన మేడారం
- తరలివచ్చిన 3 లక్షల మందికి పైగా జనం
- వనదేవతలకు ప్రత్యేక పూజలు



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 21: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం ఆదివారం కిక్కిరిసిపోయింది. వనదేవతలను దర్శించుకోవడానికి 3 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు జరగనుండగా ముందస్తుగానే మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగు వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను అందుబాటులోకి తేవడంతో వాగులో నీటి ప్రవాహనం లేకున్నప్పటికీ పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం నిలువెత్తు బంగారం (బెల్లం)తో తులాభారం వేయించి గద్దెల వద్దకు చేరుకున్నారు. క్యూలైన్ల ద్వారా వనదేవతలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు సమర్పించుకుని చల్లగా చూడాలని తల్లులను వేడుకున్నారు. మేకలు, గొర్రెలు, కోళ్లను పెద్దసంఖ్యలో

మిగతా 8వ పేజీలో



ముస్కోట్లగూడెంలో మూత పడిన ప్రాథమిక పాఠశాల

ఊరి బడికి ఊతం

- సీఎం నిర్ణయంతో పల్లెల్లో హర్షాతిరేకాలు
- పునఃప్రారంభం కానున్న ప్రాథమిక పాఠశాలలు
- జిల్లాలో 55 విద్యాలయాలను మూసేసిన గత సర్కారు

మూతపడిన స్కూళ్లకు పూర్వవైభవం

పాలకుర్తి, జనవరి 21: గ్రామీణ ప్రాంతాల్లో మూత పడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం రానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ విషయంపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా మూతపడిన ప్రాథమిక పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రాథమిక పాఠశాల ఉండాలని సూచించారు. దీంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం గ్రామ పంచాయతీలల్లో జనాభాకు అనుగుణంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేశారు. అయితే ప్రైవేటు పాఠశాలల పోటీతో పాటు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం సన్నగిల్లడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడం ప్రారంభించారు. దీంతో విద్యార్థులు లేరన్న సాకుతో గత ప్రభుత్వం కొన్ని ప్రాథమిక పాఠశాలలను మూసేసింది. ఫలితంగా లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారిపోయాయి.

జిల్లాలో 55 పాఠశాలలకు మోక్షం

జిల్లా వ్యాప్తంగా 55 ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. వాటిలో చదివిన విద్యార్థులను కొంతమందిని ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేయగా మరి కొంత మంది ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. అయితే సర్దుబాటు చేసిన పాఠశాలలకు వెళ్లడం విద్యార్థులకు కష్టమవుతోంది. రవాణా సౌకర్యం లేని చోట ఉదయం, సాయంత్రం నడుచుకుంటూ వెళుతున్నారు. తాజాగా సర్కారు తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో మూత పడిన 55 ప్రాథమిక పాఠశాలలకు మోక్షం కలగనుంది.

జిల్లాలో మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు

1) చిల్పూరు	4
2) జఫర్‌గడ్	3
3) రఘునాథపల్లి	6
4) నర్మెట	3
5) బచ్చన్నపేట	5
6) జనగామ	7
7) లింగాలఘనపురం	2
8) దేవరుప్పుల	3
10) పాలకుర్తి	17
10) కొడకండ్ల	5
11) స్టేషన్‌ఘన్‌పూర్	----
12) తరిగొప్పుల	-----
మొత్తం	55

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కసరత్తు..

త్వరలోనే మెగా డీస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతీ కిలోమీటరుకు ఒక ప్రభుత్వ పాఠశాల ఉండేవిధంగా చర్యలు చేపడుతోంది. ఆమేకు ఉపాధ్యాయుల అవసరానికి అనుగుణంగా నియామకాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. అన్ని గ్రామ పంచాయతీలల్లో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసి ఆంగ్ల మాధ్యమం ప్రారంభిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగి ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంది.

ఆదేశాలు రాగానే చర్యలు చేపడతాం : కె.రాము, డీఈవో



విద్యార్థులు లేకనే జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. వాటిని పునఃప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన మాట వాస్తవమే. అయితే ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తగు చర్యలు తీసుకుంటాం. కాగా, సర్కారు లక్ష్యం నెరవేరాలంటే తల్లిదండ్రులు కూడా సహకరించాలి. గ్రామాల్లో ఉపాధ్యాయులతో కలిసి వారు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

బౌద్ధమే సమాజానికి దిక్సూచి

వడ్డెపల్లి, జనవరి 21 : బౌద్ధమే సమాజానికి దిక్సూచి అని ప్రముఖ బౌద్ధ ప్రచారిణి బంతే సద్దా రక్షిత అన్నారు. ఆదివారం హనుమకొండలోని గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద బౌద్ధ ధర్మ ప్రచారంలో భాగంగా బుద్ధ వందనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పి నాయకులు బొమ్మల్ల అంబేద్కర్, మిద్దెపాక ఎల్లయ్య, చిట్యాల బాబు, ఇమ్మడి కొమురయ్య, ఏనుట్ల రవీందర్, దుర్గం స్వామి, సోమ రాంమూర్తి, కేడల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న రైల్వే కార్మికుల పిల్లలు

రైల్వే కార్మికుల పిల్లలకు క్రీడా పోటీలు

కాజీపేట, జనవరి 21: కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జనవరి 26ను పురస్కరించుకుని రైల్వే క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఆదివారం రైల్వే కార్మికుల పిల్లలకు పెయింటింగ్, వ్యాసరచన, క్విజ్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి పి.రవీందర్, ఏడీఈ ఎం.భాను ప్రసాద్ హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం రైల్వే స్టేడియంలో ఆర్పీఎఫ్, ఫ్రెండ్స్ 11 టీంల మధ్య జరిగిన పోటీలలో ఆర్పీఎఫ్‌టీం విజయం సాధించింది. మధ్యాహ్నం ఆపరేటింగ్ 1, ఆలేర్ పేవే టీంల మధ్య జరిగిన పోటీలలో ఆపరేటింగ్‌టీం విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం. రాజయ్య, కోశాధికారి జి. రాజేశ్వర్ రావు, ఇనిస్టిట్యూట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

లెనిన్ ఆశయ సాధనకు విద్యార్థులు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 21 : సమసమాజ స్థాపన, పీడిత ప్రజల హక్కుల కోసం కృషి చేసిన మహానీయుడు కామ్రేడ్ లెనిన్ అని, ఆయన ఆశయ సాధనకు విద్యార్థులు ఉద్యమించాలని అఖిల భారత కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు మారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకట్‌రెడ్డి ముందుగా లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లెనిన్ చనిపోయి వందేళ్లు గడుస్తున్నా ఆయనను అనుసరిస్తున్నామంటే ఆయన ఎంత త్యాగవంతుడో అర్థం చేసుకోవచ్చన్నారు. లెనిన్ ఆశయ సాధన కోసం విద్యార్థులు, యువత ముందుండి నడవాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను మార్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. అలాగే ప్రజల హక్కులను కాలరాస్తూ పరిపాలన కొనసాగించడం బాధాకరమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను తిప్పికొట్టే విధంగా లెనిన్ స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగించాలని ఆయన వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు వెంకటేశ్వర్లు, సామాజికవేత్త మాడిశెట్టి అరుణ్ కుమార్, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఎం.చంద్రారావు, ప్రజా సంఘాల నాయకులు ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, బాబు, చంద్రశేఖర్, సాంబయ్య, మాదం తిరుపతి, మాలోతు రాజేష్ నాయక్, ఉదయ్ కుమార్, గణేష్, సునీల్‌చారి, రంగస్వామి, సందీప్, రాకేశ్, సతీష్, సురేశ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ వైష్ణవి - ఆర్.సి.పురం
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
ప్రెస్టన్‌మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
అట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
ఎస్2 నోమ - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్- అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్

సామాన్యులకు సైతం అందుబాటులో ఇస్రో

ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమార్

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సామాన్యులకు సైతం అంతరిక్ష పరిశోధనా కేంద్రం(ఇస్రో) అందుబాటులో ఉందని, ఆసక్తి కలిగిన వారు అంతరిక్ష పరిశోధనల్లో పాల్గొనే అవకాశం ఉందని ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ టీఎన్ సురేష్‌కుమార్ అన్నారు. వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్ ముగింపు రోజైన సోమవారం విద్యార్థులనుద్దేశించి అతిథి ప్రసంగం చేశారు. అంబేద్కర్ లెర్నింగ్ హాల్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. తన లాంటి సాధారణ వ్యక్తి ఇస్రోలో పని చేయగలిగితే మీలాంటి తెలివైన వారు ఎందుకు రాలేరు? అని విద్యార్థులనుద్దేశించి అన్నారు. కేవలం ప్యాకేజీలను మాత్రమే పరిగణలోకి తీసుకోకుండా దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఇస్రో లాంటి పరిశోధనా కార్యకలాపాల్లో పాల్గొనాలన్నారు. నిట్ విద్యార్థులు అంతరిక్ష పరిశోధనా రంగం వైపు కూడా దృష్టి సారించాలని, ఇస్రోలో కీలక భూమిక పోషించాలని పిలుపునిచ్చారు. రియల్ టైమ్(నిజ సమయం) అనుభవాన్ని పొందడానికి ఇస్రో కేంద్రానికి రావాలని ఆహ్వానించారు. సాంకేతిక అభివృద్ధిలో కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ భూగోళంపై తాను ఇప్పటికే దాదాపు అన్ని దేశాలను తిరిగానని, తాను సందర్శించాల్సిన దేశాలు ఇంకా 25 మాత్రమే మిగిలి ఉన్నాయని, వాటిని రెండేళ్లలో పూర్తి చేస్తానన్నారు. సబ్ మెరైన్ నుంచి అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి శాస్త్రవేత్తనుతానేనన్నారు. కరోనా కాలంలో తాను తన పరిశోధనతో కలిసి రేడియోధార్మికతలు కరోనానుఏమైనా తగ్గిస్తాయా అన్న అంశంపై పరిశోధనలు చేశామన్నారు.


టెక్నోజియాన్‌లో మాట్లాడుతున్న ఇస్రో రిటైర్డ్ సైంటిస్టు డాక్టర్ సురేష్‌కుమార్

అలాగే ఇస్రోలో ఇంజనీరింగ్ స్రవంతిలోగల అవకాశాల గురించి డాక్టర్ సురేష్‌కుమార్ వివరించారు. భావసారూప్యత కలిగిన వ్యక్తులు ఒక్కటై అంతరిక్ష సాంకేతికతలో స్టార్టప్‌ల ఏర్పాటుగల అవకాశాలనుఅన్వేశించాలన్నారు. అంతరిక్ష పరిశోధన, ఇస్రో భవిష్యత్తులో చేపట్టనున్న ప్రయోగాలు తదితర అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు, వెలిబుచ్చిన సందేహాలకు సురేష్‌కుమార్ సమాధానాలు ఇచ్చారు. అనంతరం నిట్ ప్రొఫెసర్లు ఆయనను సత్కరించారు.

ఆకట్టుకున్న జహాజ్

స్టాక్ వాతావరణం సృష్టించిన వరంగల్ ట్రేడింగ్ రింగ్

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : టెక్నోజియాన్ చివరి రోజు నిర్వహించిన కొన్ని ఈవెంట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. జహాజ్, వరంగల్ ట్రేడింగ్ రింగ్ ఇందులో కొన్ని.

వరంగల్ ట్రేడింగ్ రింగ్



సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి రియల్‌టైమ్ స్టాక్ వాతావరణాన్ని ఈ ఈవెంట్ సందర్భంగా సృష్టించారు. ఇందులో పాల్గొనేవారికి వ్యాపారం చేయడానికి ఖాతాలు కూడా ఇచ్చారు. ఇందులో పాల్గొన్నవారు నిజంగా స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్యకలాపాల్లోన్న అనుభూతికి లోనయ్యారు. ఎక్కువ డబ్బు సంపాదించినవారిని విజేతలుగా ప్రకటించారు.

మెకానికల్ కిట్ అసెంబ్లీ



ఈ ఈవెంట్‌లో పాల్గొనేవారు మెకానికల్ ఇంజనీరింగ్‌లోని ప్రతీ గేర్, స్క్రూ, విడిభాగాలను అసెంబ్లింగ్ చేయడంలో తమ ప్రతిభను చాటారు. తక్కువ సమయంలో విడిభాగాలను అసెంబ్లింగ్ చేసిన వారికి రివార్డు ఇచ్చారు.

జహాజ్..

జహాజ్ ఈవెంట్‌ను కాలేజీ ప్రధాన భవనం ఎదురుగా నీటి కొలనులో నిర్వహించారు. చేతితో తయారు చేసిన రిమోట్ నియంత్రిత పడవ ఇందులో హైలెట్. ఈ పడవ నీళ్లలో ఏర్పాటు చేసిన అడ్డంకులన్నిటినీ అధిగమించి గమ్యస్థానానికి చేరుకునేలా రిమోట్‌తో నడపాలి. ఎవరైతే విజయవంతంగా పడవను నిర్ధీత లక్ష్యానికి చేర్చుతారో వారే విజేత. ఈ స్పాట్ లైట్ ఈవెంట్‌ను ప్రతి సంవత్సరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



మల్లన్నకు పట్నం భక్తుల పబ్బతి


మల్లన్నకు హారతి ఇస్తున్న అర్చకుడు


మల్లన్న ఆలయ ఆవరణలో భక్తజన సందోహం

కొమురవెల్లిలో హోరెత్తిన పట్నంవారం

భక్తజనసంద్రంగా ఆలయ పరిసరాలు

బోనాలు, పట్నాలతో దండిగా భక్తుల మొక్కులు

చేర్యాల, జనవరి 21: కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జున స్వామికి పట్నం భక్తులు పబ్బతి పట్టారు. మది నిండా మల్లన్న నామస్మరణతో పాటు డప్పుచప్పుళ్ల దరువుల నడుమ శివసత్తుల సిగాలు, పూనకాలు, పోతురాజుల చిందులతో కొమురవెల్లి విజయాచల గుట్టలు హోరెత్తాయి. మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చిన మొదటి వారాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్నంవారాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ నుంచి సుమారు లక్ష మంది భక్తులు తరలిరావడంతో కొమరవెల్లి జనసంద్రంగా మారింది. శనివారం సాయంత్రం ధూళిదర్శనం చేసుకున్న భక్తులు ఆదివారం దండిగా మొక్కులు తీర్చుకున్నారు. భక్తిప్రపత్తులతో బోనాలు తయారు చేసి నైవేద్యాన్ని నివేదించారు. బస చేసిన ప్రాంతంలో, ఆలయ గంగరేగు చెట్టు ప్రాంతంలో, ముఖ మండపంలో మల్లన్నకు చిలుకపట్నం, నజరు, ముఖమండప పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారిని దర్శించుకుని చీర, సారెలతో ఒడిబియ్యాలు పోశారు. తమ కోరికలు నెరవేర్చమని గంగరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. సంతానం కలిగించాలంటూ మహిళలు వల్లుబండ వద్ద వరం పట్టారు.

ఎల్లమ్మ దేవతకు బోనాలు

స్వామి వారి సహోదరి అయిన ఎల్లమ్మ దేవతకు బోనాలు నివేదించారు. డప్పుచప్పుళ్ల నడుమ సిగాలతో శివమెత్తుతూ ఎల్లమ్మతల్లి నామస్మరణతో గుట్టపైకి ఎక్కి అమ్మవారికి బోనాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.. బెల్లంపానకం, కల్లును నైవేద్యంగా సమర్పించి తమ పసుపుకుంకుమలు చల్లంగా చూడమని వేడుకున్నారు.

క్యూలైన్లలో పడిగాపులు

భారీగా భక్తులు హాజరవడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. పట్నాల మందిరంలోని క్యూలైన్లు నిండిపోయాయి. గంటల తరబడిగా క్యూలైన్లలో పడిగాపులు కాశారు. ఆలయ ఈవో బాలాజీ, పునరుద్ధరణ కమిటీ సభ్యులు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ పర్యవేక్షణలో చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

నేడు పట్నం, అగ్నిగుండాలు

ఆలయ తోటబావి ప్రాంగణంలో సోమవారం హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం రచించి అగ్నిగుండాలు దాటనున్నారు. వంటినిండా పసుపు ధరించి భక్తులు పట్నంతొక్కి అగ్నిగుండాలలో చిందేయనున్నారు.

అసెంబ్లీలో ఒక్కరున్నా..

కార్యకర్తల బలం ఉంది

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

సుబేదారి, జనవరి 21 : అసెంబ్లీలో సీపీఐ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే ఉన్నా.. బయట లక్షలాది మంది కార్యకర్తల బలం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివారం సీపీఐ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లాకార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివరావు మాట్లాడుతూ.. పేదలు, కార్మికులు, కష్టజీవుల పక్షాన పోరాడేది కమ్యూనిస్టు లేనని అన్నారు. సమస్యలు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని, కమ్యూనిస్టులను మించిన త్యాగధనులు లేరన్నారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధిస్తామనే విశ్వాసం తనకు ఉందని, లేదంటే పోరాటమే మార్గమని అన్నారు. పేదల హక్కుల కోసం అసెంబ్లీలో, బయట పోరాడుతానన్నారు. కేంద్రంలో దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టుపెట్టిన బీజేపీని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అయన పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధంలో భాగంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా 101 మందితో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సీపీఐ ఉమ్మడి వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె భిక్షపతి, సీహెచ్. రాజారెడ్డి, బి.విజయసారథి, మేకల రవి, కె. రాజ్‌కుమార్, రాష్ట్ర, జిల్లాల నాయకులు పంజాల రమేష్, మండ సదాలక్ష్మి, మారుపాక అనిల్, ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్‌లు సమావేశంలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

చికిత్స పొందుతూ భర్త మృతి

కమలాపూర్, జనవరి 21: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంప తులను కారు ఢీ కొట్టడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగా యాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మండలంలోని అంబాల వద్ద జరిగింది.. పోలీసు ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపి న వివరాలు ఇలా ఉన్నాయి.

మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మండలంలోని రామకృ ష్ణాపూర్‌కు చెందిన బోయిని రవి(50) తన భార్య లతతో కలసి ద్విచక్ర వాహనంపై హనుమకొండకు బయలు దేరారు. హనుమ కొండలోని వారి బంధువుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆస్పత్రికి వెళ్ళి పరామర్శించారు. అనంతరం మండలంలోని గుండేడు గ్రామంలోని తమ బంధువుల ఇంటికి అదే ద్విచక్రవాహనంపై వస్తుండగా అంబాల గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా అజాగ్రత్తగా, అతి వేగంగా వస్తున్న హనుమకొండకు చెందిన కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో చుట్టు పక్కల వారు సమాచారం ఇవ్వడంతో 108లో దంపతులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో రవి చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడని తెలిపారు. కాగా, తీవ్రగాయాలైన లత పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైనా వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని తెలిపారు. కాగా, మృతుడు ఎల్ఐసీ ఏజెంటుగా పని చేస్తున్నారని తెలిపారు. మృతుడి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నారని రవికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


ఆస్పత్రిలో మృతి చెందిన రవి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడికొండ. జనవరి 21 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మడికొండలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండ నెహ్రూనగర్ కాలనీకి చెందిన బానోత్ మల్లేష్, బానోత్ యాకూబ్ ఇద్దరూ బైక్‌పై ధర్మసాగర్‌కు వెళ్ళి తిరిగి మడికొండకు వస్తున్నారు. ఈ క్రమంలో మడికొండలోని మా ఫంక్షన్ హాల్ సమీపంలోకి రాగానే మడికొండకు చెందిన జనగాం అరవింద్, ఏదుల రాకేష్ ఇద్దరూ బైక్‌పై వేగంగా వచ్చి బానోత్ మల్లేష్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో నలుగురు కిందపడిపోయారు. ప్రమాదంలో బానోత్ యాకూబ్, బానోత్ మల్లేష్, ఏదుల రాకేష్‌కు తీవ్ర గాయాలు కాగా జనగాం అరవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక పోలీసులు గాయపడిన వ్యక్తులను 108లో ఎంజీఎంకు తరలించారు. బైకులను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



గాయపడిన ఏదుల రాకేష్, బానోత్ యాకూబ్

మరిపెడ సంతకు వచ్చి..

గుండెపోటుతో రైతు మృతి

మృతుడు ఖమ్మం జిల్లా వాసి

మరిపెడ, జనవరి 21 : కూరగాయల అమ్మకానికి మరిపెడ సంతకు వచ్చిన ఓ రైతు గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదం నింపింది. ఆ రైతు తను పండించిన టమాటలను ఆదివారం ఆటోలో మరిపెడ సంతకు తరలించి వాటిని దించుతుండగా కుప్పకూలాడు. చుట్టుపక్కల వారు గుర్తించి ఆస్పత్రికి తరలించేలోపే కన్నుమూశాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన రమణబోయిన రామస్వామి (56) తన టమాట తోట నుంచి టమాటలను ఆటోలో మరిపెడ సంతకు తీసుకొచ్చారు. వాటిని ఆటో నుంచి దించే క్రమంలో ఆయన గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారం వారం జరిగే మరిపెడ సంతకు ప్రతీ ఆదివారం రమణయ్య పిండిప్రోలు ఊరు నుంచి కూరగాయలను ఆటోలో తీసుకొచ్చి అమ్ముకునేటోడు. ఈ ఆదివారం సైతం కూరగాయలను తెచ్చి అందరూ చూస్తుండగానే రమణయ్య మృత్యు ఒడికి చేరాడని సహచర చిరు వ్యాపారులు తమ కళ్ల ముందే జరిగిన రమణయ్య మృతి ఘటనతో కన్నీటి పర్యంతం చెందారు. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలుపడంతో మృతదేహాన్ని సొంతూరుకు తరలించారు.


రామస్వామి మృతదేహం

అంతా రామమయం!

ఉమ్మడి జిల్లాలో ముస్తాబవుతున్న రామాలయాలు

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో పూజలు

ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు ఏర్పాట్లు

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అయోధ్యలో శ్రీ రామ మందిర ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతున్న నేపథ్యంలో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా అంతటా పండుగ వాతావరణ నెలకొనబోతున్నది. ప్రతీ ఇల్లు ఓ పూజా మందిరంగా మారనున్నది. ఊరు వాడా జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామాలయాలన్నీ ఇప్పటికే అందంగా ముస్తాబయ్యాయి. వీటితో పాటు ఆంజనేయస్వామి గుళ్లన్నింటినీ ప్రత్యేక పూజల నిర్వహణకు సిద్ధం చేశారు. అయోధ్యలోని శ్రీ రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగే సమయంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓం పతాకాలతో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

పలు ఆలయాల్లో..

హనుమకొండ చౌరస్తా సమీపంలోని రాగన్న దర్వాజలోని పెద్ద కోవెల, చిన్న కోవెల, రాజ్‌పుత్‌వాడలోని రామాలయం, హనుమకొండ ఏకశిల పార్క్‌ను ఆనుకొని ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, చేర్యాల మండలం ఆకునూరి రామాలయం, ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాచీన వేణుగోపాల స్వామి ఆలయం, వరంగల్ ఎల్లంబజారులోని సీతా రామచంద్రస్వామి ఆలయం, కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలోని రామాలయం, వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథ ఆలయం, వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలోని గుట్టపై ఉన్న గోవిందరాజస్వామి ఆలయం, జనగామ జిల్లా జీడికల్లులోని సుప్రసిద్ధ శ్రీరామ క్షేత్రం(వీరాచల క్షేత్రం), హనుమకొండ మచిలీబజార్‌లోని హనుమదాలయం, వరంగల్ కోటలోని రామాలయం, ధర్మసాగర్ మండలం వేలేరులోని రామాలయం, వరంగల్ శివనగర్‌లోని రామాలయం, హనుమకొండ రెవెన్యూ కాలనీలో రామాలయం, పరిమళ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం తదితర ఆలయాల్లో సోమవారం అయోధ్య రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

అక్షింతలు

ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అయోధ్య రామ మందిరం అక్షింతలు అన్ని ఆలయాలకు చేరుకున్నాయి. వాటిని విశ్వహిందూ పరిషత్, బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. వీటిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. సోమవారం అయోధ్యలో రామ మందిరంలో బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరిగే సమయంలో తమ ఇళ్లలో కూడా పూజలు నిర్వంచి తాము స్వయంగా తయారు చేసుకున్న అక్షింతల్లో వీటిని కూడా కలిపి తలలపై చల్లుకోనున్నారు. పరస్పరం పంపిణీ చేసుకోనున్నారు. ఆలయాల్లో పూజల సందర్భంగా కూడా వీటిని భక్తులకు పూజారులు అందచేయనున్నారు. పక్షం రోజులుగా అయోధ్య రామ మందిరం అక్షింతల పంపిణీ జరుగుతోంది.

టీవీలలో వీక్షణం

రామ మందిరంలో రాముడి విగహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని టీవీలు, ఇతర మాధ్యమాల్లో ప్రత్యక్షంగా ప్రసారం చేయనున్నారు. దీనితో టీవీల్లో వీక్షించేందుకు భక్తులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతిష్ఠాపన సమయంలో అందరూ ఇళ్లలో టీవీల ముందు కూర్చొనుండగా, ఆరు బయట ప్రదేశాల్లో, ఆలయాల ప్రాంగణాల్లో, పబ్లిక్ పార్కులు, టీవీ షోరూములు, వ్యాపార సంస్థలు, ఆధ్యాత్మిక మందిరాలలో భారీ డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు ప్రశాంతంగా కూర్చొని వీక్షించేందుకు వీలుగా టెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. హాజరైన భక్తులకు పంపిణీ చేసేందుకు తీర్థ ప్రసాదాలను కూడా తయారు చేస్తున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా భక్తి గీతాలాపనలు, భజనలు, సంకీర్తలను, నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. పలువురు భక్తులు పక్షం రోజులుగా భక్తి గీతాల ఆలపన సాధన చేస్తూ శ్రీ రాముడిపై తమకున్న భక్తితత్వాన్ని చాటి చెబుతున్నారు. శ్రీరాముడి ఘట్టాల ప్రదర్శనకు నగరంలోని కొన్ని నృత్య శిక్షణా సంస్థల నిర్వాహకులు తమ వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ప్రత్యేక ప్రదర్శనకు చాలా రోజుల కిందటి నుంచే సన్నాహాలు చేస్తున్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు

సాంకేతిక నిపుణుడిగా మనోజ్‌కుమార్



జనగామ కల్చరల్, జనవరి 21: చెన్నైలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ అథ్లెటిక్స్ విభాగంలో సాంకేతిక నిపుణుడిగా జిల్లా కేంద్రానికి చెందిన గంగిశెట్టి మనోజ్‌కుమార్ ఎంపికయ్యారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్టాన్లీ జోన్స్, సారంగపాణికి కృతజ్ఞతలు తెలిపారు. మనోజ్ ఎన్నిక పట్ల జనగామ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్ది వెంకటనారాయణ గౌడ్, సభ్యులు అశోక్, చందు, కిరణ్, సుధారాణి, ప్రవీణ్, రాజు, రంజిత్, సురేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

చిలుపూర్ సర్పంచ్‌కు జాతీయ అవార్డు



హైదరాబాద్‌లో జాతీయ అవార్డు అందుకుంటున్న రాజ్‌కుమార్

చిలుపూర్, జనవరి 21 : బహుజన సాహిత్య అకాడమీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో చిలుపూర్ సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్‌కు జాతీయ అవార్డును అందజేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతులమీదుగా రాజ్‌కుమార్‌కు అవార్డుతో పాటు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచ్‌గా సేవలందిస్తున్న తనను బీఎస్ఏ అకాడమీ వారు గుర్తించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామస్థుల సహకారంతో ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా గుర్తింపు పొందానని అన్నారు.

దుర్గామాతకు కొమ్మూరి మొక్కులు



మొక్కులు చెల్లించుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

బచ్చన్నపేట, జనవరి 21: మండలంలోని కొన్నె గ్రామంలో రెండు రోజుల పాటు కొనసాగిన దుర్గామాత ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. శనివారం సాయంత్రం పెద్దపట్నం వేసి, అమ్మవారి కళ్యాణ వేడుకలు ప్రారంభించిన దుబ్బుల వారు ఆదివారం తెల్లవారుజాము వరకు కొనసాగించారు. నాగవెల్లి వేడుకల అనంతరం బలిహరణ చేపట్టారు. డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆలయాలకు మహర్దశ వస్తుందన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

లింగంపల్లి సమ్మక్క జాతర ఈవోగా వంశీ



చిలుపూర్, జనవరి 21 : మినీ మేడారంగా ప్రసిద్ధి గాంచిన లింగంపల్లి సమ్మక్క సారలమ్మ వన దేవతల జాతర ఈవోగా చిందం వంశీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఈవో వంశీ మాట్లాడుతూ, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, ఉత్సవ కమిటీ ధర్మకర్తల సహకారంతో జాతరను విజయవంతం చేస్తానని పేర్కొన్నారు.

25న వేలం పాటలు..

లింగంపల్లిలో సమ్మక్క సారలమ్మ వన దేవతల జాతర నిర్వహణకు సంబంధించి వివిధ దుకాణ సముదాయములను నిర్వహించడం కోసం ఈ నెల 25న వేలం పాటలను నిర్వహిస్తామని ఈవో చిందం వంశీ తెలిపారు. ఆదివారం ఆయన వన దేవతలను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వేలం పాటలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆసక్తి గల వ్యాపారులు ఉదయం 11 గంటలకు తగు ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనవచ్చని కోరారు.



కంకరవేసి వదిలేసిన ఇప్పగూడెం-కోమటిగూడెం రోడ్డు, వాహనాలు వెళ్లే క్రమంలో రోడ్డు పై దుమ్ము లేస్తున్న దృశ్యం

కంకర పరిచారు.. తారు మరిచారు

- అధ్వానంగా ఇప్పగూడెం-కోమటిగూడెం రోడ్డు
- జాతర సమీపిస్తున్నా పూర్తికాని పనులు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 21: మరో నెల రోజుల వ్యవధిలో స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఇప్పగూడెం, రంగరాయగూడెం, కోమటీగూడెం, అక్కపల్లిగూడెంల పరిధిలో గల చింతగట్టు సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభం అవుతుంది. ఈ జాతరకు భక్తులు రావడానికి ఇప్పగూడెం నుంచి రంగరాయగూడెం మీదుగా కోమటిగూడెం వెళ్లే రోడ్డు మాత్రమే ఉంది. జాతర నాలుగు గ్రామాల కూడలిగా ఉండే చింతగట్టు వద్ద జరుగుతుంది. భక్తులు ఇప్పగూడెం, రంగరాయగూడెం మీదుగా జాతరకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో ఇప్పగూడెం నుంచి కంచనపల్లి వరకు రోడ్డు పునరుద్ధరణలో భాగంగా గత ప్రభుత్వం పంచాయతీరాజ్ విభాగం నుంచి రూ 5.10 కోట్ల నిధులు వెచ్చించగా అప్పటి ఎమ్మెల్యే రాజయ్య 2023 ఏప్రిల్ 23న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ ఇప్పగూడెం నుంచి కోమటిగూడెం నుంచి జాతర వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల రోడ్డు పనులు పూర్తిచేసి తారును సైతం పరిచారు. కాని ఇప్పగూడెం, రంగరాయగూడెంల మీదుగా జాతర వరకు చేయాల్సిన సుమారు 5కిలోమీటర్ల మేర పనులు పూర్తి కాలేదు. కేవలం కంకర వేసి వదిలేశారు. దీంతో ఈ రోడ్డు మీదుగా నిత్యం వాహనాలు వెళ్లుతుండడంతో పెద్ద ఎత్తున దుమ్ము లేస్తోంది. ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. జాతరకు నాలుగు గ్రామాలకు చెందిన వారే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది తరలివస్తారు. ఈ నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హనుమాన్‌తండా వాసుల అవస్థలు..

జఫర్‌గఢ్: మండలంలోని తీగారం పంచాయతీ పరిధిలోని హనుమాన్‌తండాకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో తండా వాసులు అవస్థలు పడుతున్నారు. బీటీ రహదారి నిర్మాణం కోసం సదరు కాంట్రాక్టరు కంకర పోసి వదిలేశాడని, పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు. గిరిజన తండాల అభివృద్ధిలో భాగంగా గిరిజనాభివృద్ధి సంక్షేమ శాఖ గత ఏడాది హనుమాన్ తండాలో సీసీ రోడ్లతో పాటు ప్రధాన రహదారి నుంచి తండాకు వెళ్లేందుకు బీటీ రహదారి నిర్మాణానికి గాను రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే సదరు కాంట్రాక్టర్ తండాలోని వివిధ వీధుల్లో సీసీ రోడ్లను 90 శాతం పూర్తి చేశారు. బీటీ రోడ్డు నిర్మాణానికి కంకర పోసి నేర్పి వదిలేశాడని.. 3 నెలలుగా పనులు ఆగిపోయాయని స్థానిక గిరిజనులు తెలిపారు. ఈ కంకర రోడ్డుపై రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సర్పంచ్ గోనె జయపాల్ రెడ్డి మాట్లాడుతూ మూడు నెలలుగా కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడన్నారు. తండాలో ఆయా వీధుల్లో సీసీ రోడ్ల పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అసంపూర్తిగా ఉన్న ఈ బీటీ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఆదివారం ఈ రోడ్డు పనులను స్థానిక గిరిజనులతో కలిసి ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న నాయక్ పరిశీలించారు. అధికారులు స్పందించి ఈ రోడ్డును త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే గిరిజనులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.



కంకర పోసి వదిలేసిన హనుమాన్ తండా రోడ్డు

గడ్డికట్టలు దహనం చేసిన దుండగులు

చిలుపూర్, జనవరి 21: మండలంలోని లింగంపల్లిలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డికట్టలను తగులబెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాత్రి తొమ్మిది గంటల సమయంలో తన పొలం వద్ద మంటలు రేగడం గమనించిన బాధిత రైతు మోతె శ్రీనివాస్ అక్కడికి వెళ్లేసరికి గడ్డి కట్టలు కాలి బూడిదయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

చిలుపూర్, జనవరి 21 : చిన్నపెండ్యాలలో ఇటీవల గుండెపోటు కారణంగా మృతిచెందిన కొత్తపెల్లి రాజమ్మ కుటుంబాన్ని 2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తాళ్ళపల్లి క్రాంతికుమార్, దుబ్బాక రంజిత్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. ఆమె కుమారుడు, తోటి మిత్రుడు అయిన కొత్తపల్లి కుమారస్వామికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందుల మహేశ్, మోడెం సంపత్ పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 21: ఆదివారం పవిత్ర ఏకాదశిని పురస్కరించుకుని స్టేషన్‌ఘన్‌పూర్ తిరుమల నాథస్వామి దేవాలయంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే పెద్ద ఎత్తున హాజరైన భక్తులు ఆలయ కమిటీ బాధ్యులు యాద శ్రీనివాస్, జయశ్రీ దంపతుల నేతృత్వంలో పంచామృత అభిషేకాలు, అలంకరణ, విశేష పూజలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు కె.రంగాచారి, ఎస్.ఆంజనేయులు, గన్ను శ్రీనివాస్, ఎం.రవీందర్, తెల్లాకుల రామకృష్ణ, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, నూక రమేశ్, నరేందర్, గోలి శ్రీను, మహేష్, పూజారులు రాము, నరేష్, శేషాచారి పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు 23 వరకు పెంపు

జనగామ కల్చరల్, జనవరి 21: గురుకులాల్లో ప్రవేశాలకు ఈ నెల 23 వరకు దరఖాస్తు గడువు పెంచినట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ కనగాల శ్రీనివాస రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 23 సాయంత్రం 5 గంటల లోగా టీజీగురుకులం డాట్ తెలంగాణ డాట్ జిగవ్ డాట్ ఇన్ వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 1800 4254 5678 నంబరులో సంప్రదించాలన్నారు.

గణతంత్ర వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాలి

జనగామ కల్చరల్, జనవరి 21: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాలని కరెన్సీ పై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో న్యాయస్థానం జిల్లా పరిషత్, పోలీస్ స్టేషన్లలో అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టకపోవడం వల్ల ఆమరణ నిరాహార దీక్ష చేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల ఇన్‌చార్జిగా రాజ్‌కుమార్

రఘునాథపల్లి, జనవరి 21: కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల ఇన్‌చార్జిగా మండలంలోని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన జీడికంటి రాజ్‌కుమార్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర నియమించారు. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం నియమాక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, కోళ్ల రవి, గుగులోతు కొంరెల్లి, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే కేంద్రం లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

స్వయం సహాయక బృందాల లబ్ధిదారులకు యూనియన్ బ్యాంకు వారి రూ.3 కోట్ల చెక్కు; మహాలక్ష్మీ, దివ్యజ్యోతి సమాఖ్య కింద ఎస్‌బీఐ వారి రూ.2.50 కోట్ల చెక్కు; ముద్ర లోన్ కింద రూ.40 లక్షల చెక్కును కేంద్ర మంత్రి అందజేశారు. అనంతరం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మై భారత్ రిజిస్ట్రేషన్లు చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శివలింగయ్య, అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్, జిల్లా ప్రబరి ఆర్‌కే జీనా, యూబీఐ డీజీఎం సత్యనారాయణ, ఏజీఎం ఎన్.శ్రీనివాస్, బీఆర్.నాయుడు, జనగామ సీఎం చంద్రశేఖర్, కేంద్ర సమాచార అధికారి శ్రీధర్, ఎన్‌వైకే అధికారి అన్వేశ్ చింత, ఎంపీటీసీ రవి, జడ్పీటీసీ దీపిక మహేందర్ రెడ్డి, డీసీఎస్‌వో రోజారాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



పాలకుర్తి ఉన్నత పాఠశాలలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుహాసిని

పాలకుర్తి, జనవరి 21 : పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండలంలోని పాలకుర్తి, తొర్రూరు గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను ఆదివారం అదనపు కలెక్టర్ సుహాసిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా ఓటరు నమోదు ఆన్‌లైన్‌లో ఎప్పుడైనా చేసుకోవచ్చని సూచించారు. ఆఫ్‌లైన్‌కు ఈనెల 22 వరకు చివరి తేది ఉందన్నారు. పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటేశం, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అధికారుల తనిఖీలు..

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వాసం రామ్మూర్తి తహసీల్దార్ పి.యుగేందర్‌తో కలిసి ఆదివారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో కవిత, దీప, శారద పాల్గొన్నారు.

జఫర్‌గడ్: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసిల్దార్ అంబటి ఆంజనేయులు సందర్శించారు. శని, ఆదివారాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం కూనూరు, సాగరం, కోనాయిచలం, తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటరు ముసాయిదా జాబితాలను పరిశీలించారు. జాబితా ప్రకారం క్షేత్ర స్థాయిలో సరి చూసుకుని, తప్పులను సవరించి, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని బీఎల్‌వోలకు సూచించారు. అర్హులందరూ ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. ఓటరు నమోదు, అభ్యంతరాల స్వీకరణ, సవరణల కోసం దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఈనెల 22 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కాగా, రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో ఫారం -6, ఫారం -7 దరఖాస్తులు 50 వరకు వచ్చినట్లు తహసిల్దార్ ఆంజనేయులు తెలిపారు.

లెనిన్ ఆశయాలను కొనసాగిద్దాం



కామారెడ్డిగూడెంలో లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్‌ఫ్లాగ్ నేతలు

దేవరుప్పుల, జనవరి 21: రష్యా విప్లవ నిర్మాత వీఐ లెనిన్ విప్లవ వారసత్వాన్ని పునికిపుచ్చుకుందామని కమ్యూనిస్టు శ్రేణులకు ఎంఎల్‌పీఐ(రెడ్‌ఫ్లాగ్) రాష్ట్రనేత దొంతి రాజేష్ కన్నా పిలుపునిచ్చారు. ఆదివారం దేవరుప్పుల మండలంలోని కామారెడ్డిగూడెం స్టేజీ వద్ద ఉన్న తెలంగాణ రైతాంగ సాయుధపోరాటయోధుడు షేక్‌బందగీ స్మారకస్థూపం వద్ద నివాళులర్పించి రెడ్‌ఫ్లాగ్ రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాల కమ్యూనిస్టు శ్రేణులకు లెనిన్ ఆదర్శ ప్రాయుడని, ఆయన శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 54సంవత్సరాల వయస్సులో రష్యాలో విప్లవం విజయవంతం చేసి, సరిహద్దు దేశాలలో కూడా విప్లవ భావాలు వెదజల్లి యునైటెడ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ ఆఫ్ రష్యాను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదని కీర్తించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మాన్యపు బుజేందర్, ఎండీ కాశీం, జిల్లా నాయకులు తూర్పాటి సారయ్య, ఎండీ పాషా, ఎండీ మున్నా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాములోరి కల్యాణం



జీడికల్‌లో రాములవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

లింగాలఘణపురం, జనవరి21: మండలంలోని సుప్రసిద్ధ జీడికల్ వీరాచల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం వరంగల్‌కు చెందిన రాయబారపు రఘురాం-రాధిక దంపతులు శ్రీ సీతారాముడి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయోధ్యనగరిలో బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్టించిన నేపథ్యంలో ఇక్కడ జీడికల్‌లో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు భార్గవాచార్యులు, మురళీకృష్ణాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ కొకె రాములు, రికార్డు అసిస్టెంట్ భరత్‌కుమార్, మల్లేశ్, శంకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ముందస్తు' జాతర

(5వ పేజీ తరువాయి)

బలిచ్చారు. భారీగా భక్తుల రాకపోత మేడారం చుట్టుపక్కల పరిసరాలు, అటవీప్రాంతం, విడిది చేసిన ప్రదేశం కిక్కిరిసిపోయింది. భక్తులు ఇక్కడే వంటలు చేసుకుని బంధుమిత్రులతో విందు భోజనాలు ఆరగించారు. సంక్రాంతి సెలవుల సమయంలో మొదలైన భక్తుల రద్దీ క్రమేపీ పెరుగుతోంది. జాతర సమయం దగ్గరపడుతున్న క్రమంలో బుధ, గురు, ఆదివారాలు, సాధారణ సెలవురోజుల్లో భక్తుల సంఖ్య లక్షలకు చేరే అవకాశం ఉంది. ఈమేరకు అధికార యంత్రాంగం సౌకర్యాలను మెరుగుపరచాలని సర్వత్రా కోరుతున్నారు.

గంటపాటు ట్రాఫిక్ జామ్..

వనదేవతలను దర్శించుకోవడానికి భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో మేడారం చేరుకున్నారు. భక్తుల రద్దీని అధికార యంత్రాంగం అంచనా వేయలేకపోయింది. దీంతో ఉదయం కొత్తూరు-జంపన్నవాగు మధ్య ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆదివారం సెలవు కావడంతో ముందస్తుగా మొక్కులు చెల్లించువడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో జంపన్నవాగు నుంచి హరితహోటల్ వరకు సుమారు కిలోమీటరున్నర వరకు గంటపాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక పార్కింగ్ స్థలాల్లోకి వాహనాలను తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనను

పండుగలా జరుపుకోవాలి

జనగామ కల్చరల్, జనవరి 21: అయోధ్యలో రామ్ లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు పండుగలా జరుపుకోవాలని రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం లైవ్ టెలికాస్ట్ ద్వారా రామ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని తిలకించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు జిల్లా ఉపాధ్యక్షులు దొంతుల శేఖర్, గునిగంటి రామకృష్ణ, బాలనారాయణ, భక్త తుకారాం పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అలుగునూరి శ్రీనివాస్

రఘునాథపల్లి, జనవరి 21: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. బాధితుడు హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రానికి చెందిన అలుగునూరి శ్రీనివాస్ (38)గా పోలీసులు గుర్తించారు. ఇక్కడికి ప్లంబింగ్ పనులు చేయడానికి వచ్చిన శ్రీనివాస్ రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొట్టి అక్కడికక్కడే దుర్మరణం చెందాడని గ్రామస్థులు తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రచార కార్యదర్శిగా లక్ష్మారెడ్డి



రఘునాథపల్లి, జనవరి 21: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజనవర్గ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శిగా నిడిగొండ గ్రామానికి చెందిన గంగిడి లక్ష్మారెడ్డిని నియమిస్తూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం అంకిత భావంతో కృషి చేస్తానని అన్నారు.

యాదవులు హక్కుల కోసం కొట్లాడాలి

జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు

జనగామ టౌన్, జనవరి 21: యాదవులు హక్కుల కోసం కొట్లాడాలని జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం జనగామలోని గాయత్రి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన అఖిల భారత యాదవ సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవులు ఐక్యమత్యంగా ఉండి రాజకీయాల్లో రాణించాలన్నారు. గొర్లు, మేకల పెంపకందారులకు కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గొర్రెల పంపిణీలో ఎదురైన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు సిద్ధిరాజుయాదవ్, ముత్తయ్యయాదవ్, ప్రశాంత్‌యాదవ్, వెంకటయ్య యాదవ్, నరేందర్‌యాదవ్, తోటకూరి భిక్షపతి యాదవ్, వేణుమాధవ్ యాదవ్, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కూనూరు హైస్కూల్‌లో గురువులను కలుసుకున్న 1997-98 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

జఫర్‌గడ్, జనవరి 21 : మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్‌లో 1997-98 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులంతా ఒక్కచోటకు చేరి... నాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ సందడి చేశారు. పరస్పరం పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి గురువులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. హైస్కూల్‌లో ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న 90 మంది విద్యార్థులకు రూ.30 వేల విలువ గల స్పోర్ట్స్ టీ షర్టులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు, పూర్వ ఉపాధ్యాయులు దేవేందర్, సుధాకర్‌రావు, ప్రస్తుత ఉపాధ్యాయులు రాజేందర్, యాదగిరి, ఎస్‌ఎంసి చైర్మన్ పోతోజు ఎల్లాచారి, సామాజిక సేవా ప్రతినిధి పల్లా రాజిరెడ్డి, పూర్వ విద్యార్థి ప్రతినిధులు అజయ్, కృష్ణ, ధనుంజయ్, శైలజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.